సాగుపోతున్న ఆయిల్ పామ్

- రైతులకు ప్రత్యేక రాయితీలు
- ఇప్పటికే 1,500 ఎకరాల్లో సాగు
- మరో నాలుగు వందల ఎకరాల్లో సాగుకు ప్రణాళికలు



డి.పోలవరంలో పతంజలి సంస్థ నర్సరీలో సాగవుతున్న ఆయిల్‌పామ్ మొక్కలు



కొలిమేరులో సాగవుతున్న ఆయిల్‌పామ్ పంట

తుని రూరల్: వాణిజ్య పంటలలో ఆయిల్‌పామ్ సాగు రైతులకు భరోసాగా నిలుస్తుంది. దేశీయంగా వంట నూనె ఉత్పత్తికి, విదేశీ మారకద్రవ్యం ఆదాకు, సాగుదారులకు నికర ఆదాయం పొందేందుకు ఆయిల్‌పామ్ తోటల సాగు ఉపయోగంగా మారింది. ఈ నేపథ్యంలో సాగు విస్తరణకు ప్రభుత్వాలు రైతులను ప్రోత్సహిస్తూ రాయితీలు అందిస్తున్నాయి. ఉద్యానశాఖ తుని సబ్‌డివిజన్ పరిధిలో ఇప్పటికే 1,500 హెక్టార్లలో ఆయిల్‌పామ్ తోటలు సాగవుతున్నాయి. తుని, కోటనందూరు, తొండంగి, శంఖవరం, రౌతులపూడి మండలాల్లో ఈ సంవత్సరం మరో మూడు వందల నుంచి నాలుగు వందల హెక్టార్లలో సాగు విస్తరించేందుకు అధికారులు ప్రణాళిక అమలు చేస్తున్నారు. కొత్తగా సాగు చేపేట్టే రైతులకు ఉచితంగా మొక్కలు పంపిణీ చేసి, ఎరువుల రాయితీ అందిస్తామని ఉద్యాన అధికారి జి.విజయలక్ష్మి తెలిపారు.

సాగు విస్తరణకు రాయితీలు

సన్న చిన్నకారు రైతులకు వందశాతం రాయితీపై మొక్కలను పతాంజలి సంస్థ అందిస్తుంది. తోటల నిర్వహణలో భాగంగా సంవత్సరానికి ఎరువులు నిమిత్తం రూ.5,250లు చొప్పున నాలుగేళ్లలో రూ.21వేలు రాయితీ లభించనుంది. ఫలసాయం అందే వరకు అంతర పంటలు సాగు చేసుకుంటే అదనపు ఆదాయం పొందవచ్చు. అంతర పంటలుగా పూల తోటలు, కూరగాయలు వంటి పంటల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం నాలుగు సంవత్సరాలు విత్తన రాయితీలు అందిస్తుంది. రైతులు విత్తనాలు కొనుగోలు చేసుకుని బిల్లులను ఉద్యాన అధికారులకు అందజేస్తే రూ.5250లు చొప్పున నాలుగేళ్లు ప్రోత్సహకాలు పొందవచ్చును.

మార్కెట్ సదుపాయం : ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు బహుళ ప్రయోజనాలు చేకూరుతాయి. పతంజలి సంస్థ నర్సరీ నుంచి ఉచితంగా ఆయిల్ పామ్ మొక్కలు పొందవచ్చు. నాలుగు సంవత్సరాలు ఎరువులకు, అంతర పంటల సాగుకు ఏకకాలంలో వేర్వేరుగా రాయితీలు లభిస్తాయి. అంతర పంటలతో అదనపు ఆదాయం సమకూరుతుంది. మార్కెట్ సదుపాయానికి భయపడాల్సిన అవసరం లేకుండ పతంజలి సంస్థ ఆయిల్‌పామ్ గెలలను కొనుగోలు చేస్తుంది. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన గిట్టుబాటు ధరనే పతంజలి సంస్థ చెల్లిస్తుంది. కొనుగోలు చేసిన గెలలకు ఆన్‌లైన్ ద్వారా రైతుల బ్యాంకు ఖాతాలకు నగదు జమావుతాయి.

30 ఏళ్ల ఫలసాయం

నాలుగు సంవత్సరాల నుంచి 30 సంవత్సరాలు లోపు వరకు ఆయిల్‌పామ్ తోటల నుంచి ఫలసాయం లభిస్తుంది. ఆయిల్‌పామ్ గెలలను పెద్దాపురం సమీపంలో ఉన్న పతంజలి సంస్థ కొనుగోలు చేస్తుంది. ఎకరాకు పది నుంచి 12 మెట్రిక్ టన్నుల ఆయిల్‌పామ్ గెలలు దిగుబడి లభిస్తుంది. సంవత్సరానికి రూ.1.50 లక్షలు వరకు ఆదాయం లభించనుంది. నిర్వహణ, గెలలు సేకరణకు ఖర్చులగా రూ.40వేల నుంచి రూ.50వేలు అయినా నికరంగా రూ.లక్ష వరకు ఆదాయం పొందవచ్చని అధికారులు పేర్కొన్నారు.

ఉద్యాన పంటలతో లాభాలు మెండు



పెదశంకర్లపూడిలో ఆయిల్ పామ్ మొక్క నాటుతున్న ఉద్యానశాఖ అధికారి శ్రీవల్లీ

ప్రత్తిపాడు: ఉద్యాన పంటల సాగు లాభసాటిగా ఉంటుందని ఉద్యాన శాఖ అధికారి ఎ.శ్రీవల్లి తెలిపారు. మండలంలోని పెదశంకర్లపూడిలో గురువారం నూరు శాతం రాయితీతో ఆయిల్ పామ్ మొక్కలను పంపిణీ చేశారు. గ్రామంలోని వరుపుల రామకృష్ణ పొలంలో గురువారం ఈ మొక్కలను నాటారు. అనంతరం ఆమె మాట్లాడుతూ హెక్టార్ విస్తీర్ణంలో ఆయిల్ పామ్ మొక్కలు, ఎరువులు, అంతర పంటకు నాలుగేళ్లగా సుమారు రూ.70 వేలు ప్రోత్సాహకంగా రైతులకు అందిస్తామన్నారు. 25 ఏళ్లు పైబడిన ఆయిల్ పామ్ తోటలకు అండర్ ప్లాంటేషన్ కూడా రాయితీలు అందుబాటులో ఉన్నాయన్నారు. బోర్ బావి కింద సాగు చేస్తున్న భూమిలో ఆయిల్ పామ్ వేసుకోవాలని చెప్పారు. ప్రతి ఆయిల్ పామ్ రైతు మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా అందుబాటులో ఉన్న ఫారం పాండ్స్ వినియోగించుకోవాలని కోరారు. మరిన్ని వివరాలు రైతు సేవా కేంద్రాలల్లో సంప్రదించాలని శ్రీవల్లి రైతులకు సూచించారు. ఏపీ ఆయిల్ ఫెడ్ ఫీల్డ్ ఆఫీసర్ ఎస్.హేమలత, సర్పంచ్ సూర్నీడి సురేష్‌కుమార్, నీటి సంఘం అధ్యక్షుడు దోశ నూకరాజు, బీజేపీ నాయకులు కర్రి ధర్మరాజు, కంద వీరాస్వామి, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మోసం చేయడమే కూటమి లక్ష్యం



ఒమ్మంగిలో పర్యటిస్తున్న వైఎస్సార్ సీపీ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు

ప్రత్తిపాడు రూరల్: ప్రజలను మోసం చేయడమే లక్ష్యంగా ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ ముద్రగడ గిరిబాబు అన్నారు. ఏలేశ్వరం మండలం భద్రవరం, మండలంలోని ఒమ్మంగి గ్రామాల్లో గిరిబాబు గురువారం పర్యటించారు. భద్రవరం గ్రామానికి చెందిన బందిల అంకాలు, కొమ్ముకూరి ఏగులమ్మ వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో బుధవారం చేపట్టిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమానికి వస్తుండగా జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. గాయపడిన క్షతగాత్రులను ముద్రగడ గిరిబాబు గురువారం పరామర్శించారు. ఈ సందర్భంగా ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం మండలంలోని ఒమ్మంగి గ్రామంలో పర్యటించారు. అక్కడ పార్టీ నేతలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల్లో సూపర్ సిక్స్ పేరుతో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని విమర్శించారు. ప్రత్తిపాడులో జరిగిన వెన్నుపోటు దినం నిరసన కార్యక్రమాన్ని విజయవంతం చేసిన వైఎస్సార్ సీపీ శ్రేణులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల కన్వీనర్లు రామిశెట్టి బులిరామకృష్ణ, పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై వన మహోత్సవం



రత్నగిరిపై స్మార్త ఆగమ పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఈఓ వీర్ల సుబ్బారావు

అన్నవరం: మనం వనం కార్యక్రమంలో భాగంగా గురువారం అన్నవరం దేవస్థానంలోని పలుచోట్ల మొక్కలు నాటారు. సత్యదేవ స్మార్త, ఆగమ పాఠశాల, దేవస్థానం హైస్కూల్, వివిధ సత్రాల ఆవరణలలో మొక్కలను దేవస్థానం ఈఓ వీర్ల సుబ్బారావు నాటారు. దేవస్థానం ఈఈ వి.రామకృష్ణ, ఏఈఓలు కె.కొండలరావు, ఎల్ శ్రీనివాస్, డీఈలు గుర్రాజు, సూపరింటెండెంట్లు భాస్కర్, కృష్ణప్రసాద్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ వేంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పెంపకంలో కానరాని శ్రద్ధ

ప్రతి ఏటా దేవస్థానంలో వనమహోత్సవం, మనం వనం తదితర కార్యక్రమాలలో వందలాది మొక్కలను నాటుతున్నారు. నాటడంలో చూపిన శ్రద్ధ పెంపకంలో చూపడం లేదు. మొక్కలు నాటే విషయంలో ఆర్భాటంగా ఫొటోలకు ఫోజులిస్తుంటారు. ఆ ఒక్కరోజే హడావిడి. మరుసటిరోజు ఆ మొక్కలకు నీళ్లు పోసే వారు కూడా ఉండడం లేదు. దీంతో దేవస్థానం అధికారులు నాటిన మొక్కల్లో దాదాపు 90 శాతం చనిపోతున్నాయి. కేవలం పది శాతం మాత్రమే అది కూడా నీటి వనరులకు దగ్గరగా ఉన్న చోట మాత్రమే బతుకుతున్నాయి. గురువారం నాటిన మొక్కల్లో కనీసం సగమైనా బతికేలా దేవస్థానం అధికారులు చర్యలు తీసుకోవాలి. తాము నాటిన మొక్కలు ఎలా ఉన్నాయో కనీసం వారం రోజులకు ఒకసారైనా చూడాలి. అప్పుడే ఈ కార్యక్రమానికి సార్థకత సమకూరుతుందనే అభిప్రాయం భక్తుల నుంచి వ్యక్తమవుతోంది.

ప్లాస్టిక్ వినియోగం తగ్గించాలి



గండేపల్లి ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్కను నాటుతున్న ఎంపీపీ

గండేపల్లి: ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి పర్యావరణాన్ని కాపాడాలని వైఎస్సార్ సీపీ నాయకులు, ఎంపీపీ చలగళ్ల దొరబాబు పిలుపునిచ్చారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యతగా ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే నష్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రాజమనోహర్, ఏఓ కె.చంద్రరావు, ఆఫీస్ సిబ్బంది లలిత, కళ్యాణి, కిరణ్, ఈసీ రమేష్, ఎన్ఆర్జీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజనులకు చీరల పంపిణీ

ఏలేశ్వరం: లయన్స్ క్లబ్ సేవలు మరింతగా విస్తృతం చేయనున్నట్టు లయన్స్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎన్‌వీబీఎస్ఎస్ ప్రసాద్ అన్నారు. పట్టణంలో గురువారం క్లబ్ అధ్యక్షుడు అనసూరి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ గవర్నర్ చేతుల మీదుగా 25 మంది నిరుపేద గిరిజన మహిళలకు ఉచితంగా చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా లయన్స్ సేవలు ముందంజలో ఉన్నాయన్నారు. సేవలను మరింతగా పెంచేందుకు కృషి చేస్తున్నామన్నారు. లయన్స్ ద్వారా అనేక సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్ ప్రతినిధులు పూర రాజాబాబు, కప్పల నాగభూషణం, అలమండ దుర్గా వెంకటప్రసాద్, గోపి, గణేష్, రాము తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వన మహోత్సవం



ప్రత్తిపాడు కోర్టు ప్రాంగణంలో మొక్కలు నాటుతున్న న్యాయమూర్తి గోపీనాథ్



ఏలేశ్వరంలో ప్రతిజ్ఞ చేస్తున్న ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ



గోకవరం ఆర్టీసీ డిపోలో మొక్కలు నాటుతున్న డీఎం సుచరిత మార్గరేట్, సిబ్బంది



ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో మొక్క నాటుతున్న ఎంపీపీ తోట రవి

మొక్కలు నాటిన న్యాయమూర్తి

ప్రత్తిపాడు: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రత్తిపాడు జ్యూడీషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో గురువారం న్యాయమూర్తి ఎల్.గోపీనాథ్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడాలని, అడవులను సంరక్షించాలని కోరారు. వాతావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటాలని, నాటిన మొక్కల సంరక్షణ చేపట్టాలని న్యాయమూర్తి కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రాజాల చిట్టిబాబు, ఐలాజ్ ప్రతినిధి బుగత శివ, మండల లీగల్ సర్వీసెస్ బాధ్యురాలు శ్రీలక్ష్మి, బార్ సభ్యులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ కె.పుణ్యవతి మొక్కలను నాటారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గోపాలకృష్ణ, వీఆర్వోలు, వీఆర్ఏలు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ఎంపీపీ గోళ్ల కాంతి సుధాకర్, ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్ బాబు మొక్కలను నాటారు. ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది మూర్తి, సురేష్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ఏలేశ్వరం: పర్యవరణ పరిరక్షణ అందరి బాధ్యతని ఎమ్మెల్యే వరుపుల సత్యప్రభ అన్నారు. నగరపంచాయతీ ఆధ్వర్యంలో పట్టణంలో గురువారం ప్రపంచ పర్యవరణ దినోత్సం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొని మొక్కలు నాటి పర్యవరణాన్ని కాపాడలన్నారు. ఆమె మాట్లాడుతూ పర్యవరణ సమతుల్యత దెబ్బతినకుండా మొక్కలు కీలకపాత్ర పోషిస్తాయన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ ఎం.సత్యనారాయణ, చైర్‌పర్సన్ అలమండ సత్యవతి, ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపి, మామిడి లలిత, సిబ్బంది పాల్గొన్నారు.

గోకవరం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం గోకవరంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ సుచరిత మార్గరేట్ ఆధ్వర్యంలో డిపో ఆవరణలో సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా డీఎమ్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని పురస్కరించుకుని డిపోలో సుమారు 300 కొత్త మొక్కలు నాటామన్నారు. కార్యక్రమంలో సూపరిండెంట్ స్వామి, అకౌంటెంట్ ప్రసాద్, ఎస్‌డిఐ దొర, సిబ్బంది అశోక్, ఫణి, గ్యారేజీ సిబ్బంది, డ్రైవర్లు, కండక్టర్లు పాల్గొన్నా రు. అలాగే గుమ్మళ్లదొడ్డిలోని అస్సాగో ఇథనాల్ పరిశ్రమలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పరిశ్రమ ఆవరణలో మొక్కలు నాటి ప్రపంచ వ్యాప్తంగా ప్లాస్టిక్ కాలుష్యాన్ని అరికట్టాలని నినాదాలు చేశారు. ఎగ్జిక్యూటివ్ డైరక్టర్ జి.వేంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ వివేక్ కుమార్ శుక్లా, హెచ్‌ఆర్ చంద్రశేఖర్, భవానీశంకర్ పాల్గొన్నారు.

కిర్లంపూడి: పర్యావరణంతోనే ప్రజలకు ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ తోట రవి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీడీఓ హెచ్.హరికృష్ణ అధ్యక్షతన మండలంలోని గురువారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి తోట రవి ముఖ్యఅతిదిగా పాల్గొని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఎంపీడీఓ కార్యాలయం ఆవరణలో మొక్కలను నాటారు. అనంతరం పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేస్తామని సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. జడ్పీటీసీ సభ్యులు తోట గాంధీ, డిప్యూటీ ఎంపీడీఓ సత్యప్రసాద్, ఏపీఓ నాయుడు, ఎంఈఓ టి.జోసెఫ్, పలువురు స్థానిక నాయకులు ఉన్నారు.

తుని రూరల్: పర్యావరణ పరిరక్షణలో భాగంగా నాటే మొక్కలను సంరక్షిస్తేనే ప్రయోజనం ఉంటుందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ యనమల దివ్య అన్నారు. గురువారం తుని మండలం ఎస్.అన్నవరం పంచాయతీ పరిధిలో కోమటి చెరువు గట్టుపై పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆమె మొక్కలను నాటారు. తుని మున్సిపల్ చైర్మన్ నార్ల భువన సుందరి, సుర్ల లోవరాజు, పోలిశెట్టి రామలింగేశ్వరరావు, చోడిశెట్టి గణేష్, ఎంపీడీఓ కె.సాయినవీన్, కార్యదర్శి వీరలక్ష్మి, కౌన్సిలర్లు,సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కోటనందూరు: పర్యావరణ పరిరక్షణనూ అందరూ బాధ్యతగా తీసుకోవాలని ఎంపీడీఓ వెంకటనారాయణ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా స్థానిక మండల పరిషత్, తహసీల్దార్ కార్యాలయాల్లో తహసీల్దార్ సుభాష్‌తో కలిసి మొక్కలు నాటారు. ఎంపీడీఓ మాట్లాడుతూ వాతావరణంలో అసమానతలు తొలగాలంటే మొక్కలను పెంచడం కీలకమన్నారు. ప్రతీ ఒక్కరూ మొక్కలను నాటడం, వాటిని సంరక్షించడం అలవర్చుకోవాలని సూచించారు. ఉద్యానవనశాఖ ఆధ్వర్యంలో కేపీ మల్లవరంలో ఉద్యానశాఖ అధికారి జీవీ లక్ష్మి, సిబ్బంది మొక్కలు నాటారు. ఈఓపీఆర్డీ జయరాం, ఎంఈఓ శ్రీనివాస్, ఏపీఓ రాజగోపాల్, డీటీ సత్యన్నారాయణ, ఏఈఓ శివకుమారి తదితరులు పాల్గొన్నారు.

శంఖవరం: మొక్కలతో పర్యవరణానికి మేలు చేకూరుతుందని ఎంపీపీ పర్వత రాజబాబు అన్నారు. ప్రపంచ పర్యవరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎంపీడీఓ ప్రసాద్, ఎఈఓ ఎన్వీ రమణలతో కలిసి స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటారు. మండల వ్యాప్తంగా ప్రజా ప్రతినిధులు, అధికారులు గ్రామ స్థాయిలో పర్యవరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎంపీపీ రాజబాబు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటేందుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. మొక్కలు పెరిగి మనకు నీడను ఇవ్వడంతో పాటు కాలుష్య నివాణకు దోహదపడతాయన్నారు. కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

రౌతులపూడి: ప్రజలందరికీ సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతి ఒక్కరూ చెట్లును నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని ఎంపీపీ జి.రాజ్యలక్ష్మి అన్నారు. గురువారం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీఓ బి.శివ రామకృష్ణయ్య ఆధ్వర్యంలో వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యాలయం ఆవరణలో చెట్టును నాటారు. ఆమె మాట్లాడుతూ చెట్టును నాటడంతో స్వచ్ఛమైన గాలిని ఆశ్వాదించి తద్వారా మంచి ఆరోగ్యానికి బాటలు వేసుకోవచ్చాన్నారు. ప్రతి ఒక్కరూ చెట్టును నాటడం బాధ్యతగా తీసుకోని వాటిని సంరక్షించాలని ఆమె సూచించారు. మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, పైల వేణగోపాల్, పసగడుగుల వెంకటరమణ, ఎన్ఆర్ఈజీఎస్ జేఈ కాంచన, ఏపీఓ సురేష్ సిబ్బంది పాల్గొన్నారు.

తొండంగి: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఒంటి మామిడిలో దివీస్ ల్యాబోరేటరీస్ ఆధ్వర్యంలో గురువారం హరిత ర్యాలీ జరిగింది. దివీస్ పరిశ్రమ అధికారులు, సిబ్బంది ప్లాస్టిక్ కాలుష్యంపై అవగాహన కల్పించారు. పర్యావరణహితమైన గోనె సంచులను పంపిణీ చేశారు. అనంతరం 500 మొక్కలను నాటాలరు. సంస్థ ఆధ్వర్యంలో తీరప్రాంతంలో ఐదువేల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నామని సంస్థ జనరల్ మేనేజర్ వి.నాగేశ్వర్ తెలిపారు. దివీస్ సంస్థ ప్రతినిధులు బి.వాసుబాబు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

నిర్వాసితులకు స్థల పరిశీలన



సూదికొండ సమీపంలో స్థలాన్ని పరిశీలిస్తున్న చింతూరు అధికారులు, గిరిజనేతరులు

గోకవరం: పోలవరం ముంపు బాధితుల స్థల పరిశీలనలో భాగంగా ఫేస్–1బీలో చేర్చిన చింతూరుకు చెందిన గిరిజనేతర నిర్వాసితుల కోసం గురువారం గోకవరం మండలం జగన్నాధపురం వద్ద కాలనీల నిర్మాణాలకు కావాల్సిన స్థలాలను పరిశీలించారు. చింతూరుకు చెందిన పోలవరం నిర్వాసితులైన గిరిజనులకు రంపచోడవరం డివిజన్‌లో గంగవరం, అడ్డతీగల, రాజవొమ్మంగి ప్రాంతాల్లో కాలనీల నిర్మాణాలకు, గిరిజనేతరులకు గోకవరం సమీపంలోని సూదికొండ, కృష్ణా జిల్లా తిరువూరు ప్రాంతాల్లో పునరావాస కాలనీలు నిర్మించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనిలో భాగంగా గురువారం జగన్నాధపురం సమీపంలోని సుమారు 124 ఎకరాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ కృష్ణాజిల్లా తిరువూరు ప్రాంతంలో తమకు స్థలాలు చూపిస్తే వాటిని కూడా పరిశీలించి రెండిట్లో ఏది ఆమోదయోగ్యంగా ఉంటే ఆ విషయాన్ని అధికారులకు తెలియజేస్తామన్నారు. చింతూరు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ చంద్రశేఖర్, తహసిల్దార్ చిరంజీవి, ఆర్ఐ విగ్నేష్, సెక్రటరీ ప్రసాదరావు, విఆర్ఓ రామచంద్రం పాల్గొన్నారు.

అందుబాటులోకి ఎంఎల్‌టీ కోర్సు

ఏలేశ్వరం: ఈ ఏడాది నుంచి స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నూతనంగా ఎంఎల్‌టీ (మెడికల్ ల్యాబ్ టెక్నీషియన్) గ్రూపును ప్రారంభిస్తున్నట్టు ప్రిన్సిపాల్ కె.ఎస్.ఎస్ రాజశేఖర్ తెలిపారు. ఆయన గురువారం మాట్లాడుతూ ఎంఎల్‌టీ గ్రూపు ఏర్పాటుపై ఉత్తర్వులు జారీ అయ్యాయన్నారు. పరిమిత సీట్లు కలిగిన ఈ పారా మెడికల్ కోర్సునందు చేరేందుకు ఆసక్తి గల విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలన్నారు. కళాశాల యందు ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ, ఎంపీహెచ్ గ్రూపుల్లో అడ్మిషన్లు జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రస్తుతం కళాశాలలో క్లాసులు నిర్వహిస్తున్నామన్నారు.

ప్రకృతిని నాశనం చేయవద్దు



ఆదిత్య క్యాంపస్‌లో మొక్కలు నాటుతున్న సిబ్బంది

గండేపల్లి: మానవ స్వార్థం కోసం ప్రకృతిని నాశనం చేయవద్దని ఆదిత్య యూనివర్సిటీ ప్రొ.వైస్ చాన్సలర్ ఎస్. రమాశ్రీ, ఆదిరెడ్డి రమేష్, రిజిస్ట్రార్ సురేష్, ప్రిన్సిపాల్ రవిశంకర్లు సూచించారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం సూరంపాలెం ఆదిత్య క్యాంపస్‌లో మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం వారు మాట్లాడుతూ పచ్చని ప్రకృతిని కాపాడుకునే బాధ్యత మనందరిపైన ఉందన్నారు. తిండికి, బట్టకు, నివాసానికి, ఎన్నో అవసరాలకు ప్రకృతి నుంచి తీసుకుంటున్నామని మన స్వార్థం కోసం పర్యావరణాన్ని నాశనం చేయకూడదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విలాస్ అనిల్ చవాన్, డీన్ స్టూడెంట్స్ అఫైర్స్ డి కిషోర్, ఎంవి రాజేష్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్స్ రాంబాబు, ఐవి వీరాంజనేయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రకృతి సంపదను పంచుదాం



ప్రగతిలో పర్యావరణ దినోత్సవంలో పాల్గొన్న బెటాలియన్

గండేపల్లి: రానున్న తరాలకు ప్రకృతిని సంపదగా పంచుదామని ప్రగతి ఇంజనీరింగ్ కళాశాల చైర్మన్ పి. కృష్ణారావు పిలుపునిచ్చారు. సూరంపాలెం ప్రగతిలో ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ర్యాలీ, స్వచ్ఛ భారత్ అభియాన్, మొక్కలు నాటడం, డ్రాయింగ్ పోటీలు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ గ్రూప్ హెడ్ క్వార్టర్స్ 9 ఆంధ్ర బెటాలియన్ ఆధ్వర్యంలో ఆఫ్ సెట్టింగ్ కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ పి.ప్రవీణ్ బాబు, ఎన్‌సీసీ కేర్ టేకర్, బి. ఆదినారాయణ, డైరక్టర్ ఎంవి హరనాధబాబు, పాల్గొన్నారు.

7న స్వామి వార్షిక కల్యాణం

ఏలేశ్వరం: పట్టణంలోని శ్రీ అనంతలక్ష్మీ సమేత శ్రీ సత్యనారాయణ స్వామి వార్షిక కల్యాణం ఈనెల 7న నిర్వహించనున్నట్టు అన్నవరం దేవస్థానం కార్యనిర్వహణాధికారి వి.సుబ్బారావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్నవరం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహించే కల్యాణ మహోత్సవాలు ఈ నెల 6 నుంచి 12 తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ నెల 6న స్వామి అమ్మ వార్లను పెండ్లికుమారుడు, పెండ్లికుమార్తైల అలంకరణ చేయనున్నారు. 7న కల్యాణం, 8న గ్రామోత్సవం, 9న సద్యసం, పండిత సత్కారం, 10న విశేషార్చన, 11న పూర్ణాహుతి, చక్రస్నానం, ప్రసాద వితరణ, శ్రీ పుష్పయాగం, దంపతుల తాంబూలం, 13న అన్న సమారాధన నిర్వహించనున్నారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామి వారి కల్యాణంలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని కార్యనిర్వహణాధికారి కోరారు.

వైఎస్సార్ సీపీ మున్సిపల్ అధ్యక్షురాలిగా వీరరాఘవమ్మ

ఏలేశ్వరం: వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు నియోజకవర్గ మున్సిపల్ విభాగం అధ్యక్షురాలిగా జువ్విన వీరరాఘవమ్మను నియమించారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ నియామకం జరిగినట్టు గురువారం పార్టీ వర్గాలు ప్రకటించాయి. గతంలో మున్సిపల్ కౌన్సిలర్‌గా వీరరాఘవమ్మ పనిచేశారు. ఈ అనుభవంతో పదవికి ఆమెను ఎంపిక చేసినట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఈ సందర్భంగా పలువురు పట్టణ పార్టీ నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు.

కళాశాల నిర్మాణానికి శంకుస్థాపన

తొండంగి: మండలంలోని వాకదారిపేటలో కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయంలో జూనియర్ కళాశాల భవన నిర్మానానికి ప్రభుత్వ విప్, తుని ఎమ్మెల్యే యనమల దివ్య గురువారం శంఖుస్థాపన చేశారు. కేజీబీవీలో జూనియర్ కళాశాల భవన నిర్మాణానికి ప్రభుత్వం సమగ్రశిక్ష ద్వారా రూ2.55 కోట్లు మంజూరు చేయడంతో ఆమె భూమి పూజ చేసి శంఖుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో వివిధశాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అనధికార కబేళాలపై కఠిన చర్యలు

గోకవరం: అనధికారికంగా కబేళాలు నిర్వహించి జంతువులను వధిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గోకవరం ఎస్సై పవన్‌కుమార్ హెచ్చరించారు. మండలంలో మూసి ఉన్న కాబేళాలను గురువారం ఆయన పరిశీలించారు. అనుమతులు లేని జంతు వధశాలలు నిర్వహిస్తే చట్టరీత్యా శిక్షార్హులవుతారని తెలిపారు. అనంతరం ముస్లిం మత పెద్దలను కలిసి వారికి ముందుగా బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేశారు. బక్రీద్ పండుగలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా, ప్రశాంతంగా, సంతోషంగా జరుపుకోవాలని సూచించారు. డ్రైవర్స్ కాలనీలో నేరాలకు పాల్పడుతున్న పలువురిని కలిసి వారిపై ప్రత్యేక నిఘా ఉందని, నేరాలకు పాల్పడితే పీడీ యాక్టులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తంటికొండ ఆర్చ్ వద్ద ఏర్పాటు చేసిన అంతర జిల్లా చెక్ పోస్టును సందర్శించి, సిబ్బందికి తగు సూచనలిచ్చారు.

ఇద్దరు సారా విక్రేతల అరెస్టు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని ప్రత్తిపాడు, కిర్లంపూడి మండలాల్లోని సారా విక్రేతలపై గురువారం స్థానిక ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించారు. ఈ దాడిలో 15 లీటర్ల సారాతో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. స్థానిక ఎక్సైజ్ సీఐ పి.శివప్రసాద్ వివరాల మేరకు, సారా విక్రయిస్తున్నట్లు అందించిన సమాచారంతో తనిఖీలు చేశారు. ప్రత్తిపాడు మండలం టి.రాయవరం గ్రామంలో సూరంపూడి రాఘవ నుంచి ఐదు లీటర్లు, కిర్లంపూడిలో మాదిపోయిన దుర్గాప్రసాద్ నుంచి పది లీటర్ల సారాను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్థానిక కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి ఎల్.గోపీనాథ్ రిమాండ్‌కు ఆదేశించారు. ఈ తనిఖీల్లో ఎక్సైజ్ ఎస్సై పున్నం వంశీరామ్, ఇతర సిబ్బంది పాల్గొన్నారని ఎక్సైజ్ సీఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

తుని రూరల్: హంసవరంలో ఉన్న ఏపీ మోడల్ స్కూల్ (ఆదర్శ పాఠశాల)లో ఖాళీగా ఉన్న 7,8, 9 తరగతులలో సీట్లను భర్తీ చేసేందుకు ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు స్కూల్ ప్రిన్సిపాల్ పి.పద్మజ గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రవేశ ప్రక్రియ రోస్టర్ పాయింట్లు ఆధారంగా పూర్తిగా ఆన్‌లైన్‌లో జరుగుతుందన్నారు. ఆసక్తిగల విద్యార్థులు, తల్లిదండ్రులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. జూన్ 5 నుంచి 20 వరకు రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి, 20 తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

వర్షంతో ఉపశమనం

తొండంగి: వారం రోజుల నుంచి భానుడి ప్రతాపానికి విలవిల్లాడిన ప్రజలకు గురువారం సాయంత్రం కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. నైరుతి రుతుపవనాల ప్రభావంతో ముందుగా వర్షాలు వచ్చినప్పటికీ, వారం రోజుల నుంచి ఎండ తీవ్రత పెరిగిపోవడంతో పాటు పగటి ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలకు పైగా నమోదయ్యాయి. తీవ్రమైన వడగాడ్పులతో ప్రజలు ఇబ్బందులుపడ్డారు. గురువారం సాయంత్రం ఆకాశం మేఘావృతమై మోస్తరు వర్షం కురవడంతో వాతావరణం చల్లబడింది. దీంతో ప్రజలు ఎండ వేడిమి నుంచి సేదతీరారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

సామర్లకోట: ప్రభుత్వ పాఠశాలలు ప్రారంభించే రోజున సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్రా కిట్లను రాష్ట్ర ఎడ్యుకేషన్ డైరెక్టరు, జిల్లా నోడల్ అధికారి బి.ప్రతాప్‌రెడ్డి గురువారం పరిశీలించారు. స్థానిక గిరిజన ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులు పుస్తకాలు, బ్యాగ్‌లు, కిట్లను భద్రపర్చిన విషయం విదితమే. ఈ మేరకు ఆయన మండల పరిధిలో పాఠశాలల సంఖ్య, విద్యార్థుల సంఖ్యను మండల విద్యాశాఖాధికారి 2 పి.పుల్లయ్యను అడిగి తెలుసుకున్నారు. స్టాక్‌పాయింట్ నుంచి ఆయా పాఠశాలలకు కిట్లు చేరే విధానాన్ని ఆయన అడిగి తెలుసుకున్నారు. రికార్డులను పరిశీలించారు. ప్రతీ విద్యార్థికి పాఠశాల ప్రారంభం రోజునే కిట్లు అందజేసి వారి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. సీఎంఓ చామంతి నాగేశ్వరరావు, ఎఎస్ఓ జోగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ నిలుపుదల

తొండంగి: మండలంలోని గోపాలపట్నం 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుల్‌లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని జగ్గంపేట విద్యుత్ శాఖ ఈఈ వీరభద్రరావు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకూ సబ్‌స్టేషన్ పరిధిలో అన్నవరం, ఏ.కొత్తపల్లి, బెండపూడి, గోపాలపట్నం, గవరపేట, రావికంపాడు, చిన్నాయపాలెం, తమ్మయ్యపేట తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు. కావున విద్యుత్ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలన్నారు.